సాక్షి నంద్యాల

మంగళవారం | 12 | ఆగస్టు | 2025



స్వామీ.. భక్తుల కష్టాలు కనుమా!

భక్తుల రద్దీకి తగ్గ ఏర్పాట్లు చేయడంలో ఉరుకుంద ఈరన్న దేవాలయం అధికారులు విఫలం అయ్యారు. ట్రాఫిక్ స్తంభించి భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 8లో ▸



దేవుడికి పూజారి శఠగోపం

ఓ పూజారి అప్పుల బాధ నుంచి బయటపడాలని భావించాడు. దేవుడి వెండి ఆభరణాలు ఇంట్లో ఉంచుకున్నాడు. విక్రయించాలని వాటిని తరలిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 31,980
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 31,775

న్యూస్‌రీల్

జడ్జీల నియామకం

నంద్యాల(వ్యవసాయం): జిల్లాకు జడ్జీను నియమిస్తూ సోమవారం హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. చిత్తూరు జిల్లా పీలేరు నుంచి ఎస్.శ్రీనివాసులు నంద్యాల పీడీఎం కోర్టుకు, నెల్లూరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ పి.వినోద్ డోన్‌కు బదిలీపై రానున్నారు. జడ్జి వినోద్‌కుమార్ సెప్టెంబర్ 14వ తేదీ వరకు ట్రైనింగ్ తర్వాత బాధ్యతలు చేపట్టనున్నారు. నంద్యాల పీడీఎం కోర్టు ఇన్‌చార్జిగా ఉన్న జడ్జి లక్ష్మికర్రి యథాతథంగా అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా కొనసాగుతారని కోర్టు సిబ్బంది తెలిపారు.

సర్టిఫికెట్లతో హాజరు కావాలి

నంద్యాల(న్యూటౌన్): డీసెట్- 2025లో అర్హత సాధించిన విద్యార్థులు సంబంధిత డైట్ కాలేజీల్లో 11 నుంచి 14వ తేదీ వరకు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు.

తాగు, సాగునీరు అందక సీమలో కరువు



బొజ్జా దశరథరామిరెడ్డి

నంద్యాల(న్యూటౌన్): తాగు, సాగునీరు అందక రాయలసీమ ప్రాంతం కరువుతో అల్లాడుతోందని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పందికోన రిజర్వాయర్ కింద 61,400 ఎకరాలకు నీరు ఇవ్వాల్సి ఉందని, అయితే నేటికీ 10వేల ఎకరాలకు కూడా అందించని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. హంద్రీ-నీవా ప్రధాన కాల్వ కింద పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరు అందించేలా కార్యచరణ చేపట్టాలన్నారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో 106 చెరువులకు హంద్రీ-నీవా నీటిని నింపి కోనసీమ చేస్తామన్న ముఖ్యమంత్రి దీన్ని 66 చెరువులకు కుదించారన్నారు.

ఆటో డ్రైవర్ల నిరసన



కొలిమిగుండ్ల: రాష్ట్ర ప్రభుత్వం తమకు అన్యాయం చేయొద్దని కోరుతూ ఆటోడ్రైవర్లు సోమవారం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు అమలు చేస్తే ఆటోడ్రైవర్లకు ఉనికి లేకుండా పోతుందన్నారు. ఈ పథకంపై ప్రభుత్వం పునరాలోచించుకోవాలని కోరారు.

ముంచెత్తిన వాన



కోవెలకుంట్ల మండలం అమడాల సమీపంలో మొక్కజొన్న పొలంలో చేరిన వర్షపునీరు

- ఉప్పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- రహదారులు, పలు కాలనీలు జలమయం
- ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది
- నీట మునిగిన పంట పొలాలు



తెళ్లపురి వద్ద ఉప్పొంగి ప్రవహిస్తున్న కుందూ నది

నంద్యాల: జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. రహదారులన్నీ జలమయమై రాకపోకలు స్తంభించిపోయాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, వరి, పొగాకు పొలాల్లో నీరు నిలిచిపోయింది. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. జిల్లాలోని కుందూనది పోటెత్తి ప్రవహిస్తోంది. నంద్యాల పట్టణంలోని మద్దిలేరువాగు ఉప్పొంగి ప్రవహించడంతో భీమవరం, పీవీనగర్, పెసరవాయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నంద్యాల పట్టణంలోని పీవీనగర్, హరిజనపేట, అరుంధతి నగర్ కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గోస్పాడు మండలంలో రాయపాడు, తెళ్లపురి గ్రామాల మధ్య కుందూనది ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అటువైపు ప్రజలు ఎవరూ వెళ్లరాదని గోస్పాడు తహసీల్దార్ సూచించారు. బండి ఆత్మకూరు మండలంలో భోజనం, సంతజూటూరు, బండి ఆత్మకూరు, కాకనూరు గ్రామాల్లోని కుందూ నది వెంట ఉన్న పొలాలు పూర్తిగా జలమయం అయ్యాయి. వరద ఉధృతి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ జగన్ మోహన్ ఆధ్వర్యంలో పోలీస్ పికెటింగ్ నిర్వహించారు.

ఇవీ ఇబ్బందులు..

- ➡ శిరివెళ్ల- యాళ్లూరు రోడ్డు గుంతల్లో వర్షపు నీరు చేరి రాకపోకలు కష్టంగా మారాయి.
- ➡ రుద్రవరం మండలం చిలుకలూరు గ్రామం పక్కనే వంతెనపై నీటి ప్రవాహం ఉండటంతో రాకపోకలు నిలిచి పోయాయి.



మద్దిగుండం చెరువుకు పడిన గండి

- ➡ ఉయ్యాలవాడ మండలం అల్లూరు, మాయలూరు, పుచ్చకాయలపల్లె, బోడెమ్మనూరు, సుద్దమల్ల గ్రామాల్లో కాలువల నుంచి వచ్చే మురుగు నీరంతా సిమెంట్ రోడ్లపై నిలిచింది. ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- ➡ చిన్న వంచె వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కోవెలకుంట్ల- లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో రాకపోకలు స్తంభించి పోయాయి. లింగాల మీదుగా నంద్యాల ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అస్కారం లేకపోవడంతో కోవెలకుంట్ల వైపు వచ్చి ఆయా ప్రాంతాలకు వెళుతున్నారు.
- ➡ మిడుతూరు మండలంలోని మదిగుండం చెరువు వద్ద తూముకు గండి పడింది.
- ➡ నందికొట్కూరు పట్టణంలోని రహదారులు జలమయంగా మారడంతోపాటు పింజరిపేటలో పాత మట్టి మిద్దె కూలింది. ఆ సమయంలో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.



కొత్తపల్లి మండలం నందికుంట, ఆత్మకూరు రహదారిపై వాహనచోదకుల అవస్థలు



వెలుగోడు- వేల్పనూరు రహదారిలో పొంగి ప్రవహిస్తున్న మంచినీళ్ల వాగు

- ➡ జూపాడుబంగ్లా మండలం తరిగోపుల, పి.లింగాపురం, 80బన్నూరు గ్రామాల సమీపంలోని కాకిలేరువాగు ఉప్పొంగి ప్రవహించింది. ఇసుక వాగు నీరు తర్తూరు ఎస్సీకాలనీని ముంచెత్తింది. పారుమంచాల, తూడిచెర్ల, వాడాల, రేగడగూడూరు, వెలుగోడు మీదుగా నంద్యాలకు రాకపోకలు స్తంభించిపోయాయి.
- ➡ కొత్తపల్లి మండలంలో రోడ్లన్నీ చెరువులను తలపించాయి. సంగమేశ్వరం-ఆత్మకూరు ప్రధాన రహదారిలో నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలో ఎంపీపీ స్పెషల్ స్కూల్ ఆవరణంలో వర్షపునీరు నిలిచి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.
- ➡ పగిడ్యాల మండలలో లక్ష్మాపురంలోని సుద్ద వాగు, చిన్నెద్దుల వంక వాగు, పగిడ్యాలలో నల్లవాగు పొంగిపొర్లాయి.
- ➡ గడివేముల జెడ్పీ హైస్కూల్ మైదానంలో వర్షపునీరు నీరు చేరి చెరువును తలపించింది.
- ➡ భారీ వర్షంతో మహానందిలో పెళ్లిళ్ల నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. వర్షం కారణంగా ఆలయం ముందు ఉన్న సుపథ మండపాల్లో వివాహాలు చేసుకున్నారు.
- ➡ వెలుగోడు మండలంలో వేల్పనూరు శివారులోని మంచినీళ్ల వాగు, మాధవరం గ్రామంలోని నిప్పులవాగు ఉధృతంగా ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. వెలుగోడు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయయ్యాయి.
- ➡ నల్లమలలో అతి భారీ వర్షం కురవడంతో భవనాశి, సుద్దవాగులు పొంగి ప్రవహించాయి. ఆత్మకూరు పట్టణశివారు కాలనీలో వర్షపునీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బండిఆత్మకూరు మండలం లింగాపురం గ్రామ సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

జిల్లాలో వర్షపాత వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ)
నందికొట్కూరు	131.4
వెలుగోడు	118.2
పాములపాడు	96.8
జూపాడుబంగ్లా	94.8,
కొత్తపల్లి	94.8
బండిఆత్మకూరు	94.4
గడివేముల	68.6
మిడుతూరు	68.4
ఆత్మకూరు	52.8
పగిడ్యాల	46.8
మహానంది	40.4
కోవెలకుంట్ల	29.8
పాణ్యం	28.2
శిరివెళ్ల	25.8
నంద్యాల అర్బన్	24.8
చాగలమర్రి	22.0
బనగానపల్లె	19.0
ఉయ్యాలవాడ	17.6
డోన్	16.0
నంద్యాల రూరల్	14.6
రుద్రవరం	13.8
బేతంచెర్ల	13.2
ఆళ్లగడ్డ	12.0

తపాలా బీమా ఏజెంట్ల నియామకానికి దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): తపాలా శాఖలో జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా కర్నూలు డివిజన్‌లో పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు డివిజన్ తపాలా శాఖ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20వ తేది వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలన్నారు. స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలోని ప్రధాన తపాల కార్యాలయంలో ఆయా తేదిల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ జి.హరిక్రిష్ణారెడ్డిను 7013029312 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై వర్క్‌షాప్

కర్నూలు(అర్బన్): స్వరాజ్య అభియాన్-ఆర్‌జీఎస్‌ఏ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 1.0 నుంచి వెర్షన్ 2.0 పరివర్తన వ్యాప్తిపై ఈ నెల 12న ఒక్క రోజు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్‌లోని డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. వర్క్‌షాప్‌నకు జిల్లా కలెక్టర్ కన్వీనర్‌గా, జెడ్పీ చైర్మన్ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, డివిజినల్ అభివృద్ధి అధికారులు, డీఎల్‌పీఓ, జెడ్పీటీసీ, ఎంపీడీఓలు హాజరు కావాలని ఆయన కోరారు. అదేవిధంగా 13వ తేదిన అన్ని మండల కేంద్రాల్లో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం గ్రామ పంచాయతీ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు సంబంధిత శాఖల నుంచి గ్రామ ప్రజల సామాజిక ఆర్థిక స్థితిగతుల సమాచారాన్ని సేకరించాలన్నారు.

జీడీపీలో 2 టీఎంసీల నీరు

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్ట్ (జీడీపీ)లో సోమవారం సాయంత్రానికి రెండు టీఎంసీల నీరు నిల్వకు చేరిందని ప్రాజెక్టు ఏఈ మహమ్మద్ అలీ తెలిపారు. వర్షాలతో 2 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి జీడీపీలోకి చేరుతోందన్నారు. హంద్రీ-నీవా నుంచి 160 క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టుకు 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసే సామర్థ్యం ఉందని చెప్పారు.

జాతీయ సమైక్యత కోసం 'తిరంగా' ర్యాలీ




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా జాతీయ సమైక్యత కోసం ఈనెల 12న నంద్యాల పట్టణంలో మార్కెట్ యార్డు నుంచి గాంధీ చౌక్ వరకూ హర్ ఘర్ తిరంగాపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాల్‌లో జిల్లాలో నిర్వహించే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం నిర్వహణపై సోమవారం జిల్లా అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీల్లో, మండలాల్లో, జిల్లా కేంద్రంలో నిర్వహించే హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో పౌరులు, విద్యార్థిని, విద్యార్థులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో భాగంగా అమృత్ సరోవర్ పనులు జరిగిన ప్రాంతాల్లో ఫొటోలు దిగి సంబంధిత సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను త్రివర్ణ రంగులతో కూడిన దీపాలతో అలంకరించాలన్నారు. అదే విధంగా హర్ ఘర్ తిరంగా సైట్‌లో అందరూ నమోదై, అందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై దివ్యతేజం

- శ్రీమఠంలో వైభవంగా శ్రీరాఘవేంద్రుల మధ్యారాధన



శ్రీరాఘవేంద్రస్వామి మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు



అశేష భక్తజనం మధ్య శ్రీరాఘవేంద్ర స్వామి స్వర్ణ రథోత్సవం

మంత్రాలయం: సద్గురు శ్రీరాఘవేంద్రులు సశరీరంగా బృందావన ప్రవేశం చేసిన శుభదినం.. పరమగురుడి 354వ ఆరాధన పర్వదినం.. వేదభూమి పులకించి తుంగభద్రమ్మ పరవశించిన తరుణం.. చూసిన కనులదే మహాభాగ్యం. విశ్వమోహనుడి ఆరాధన సప్తరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన మధ్యారాధన మహా మంగళకరం. సోమవారం శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మధ్యారాధన దేదీప్యమానంగా సాగింది. వేడుకల్లో భాగంగా రాఘవేంద్రుల మూల బృందావనానికి మహా పంచామృతాభిషేకం చేశారు. అభిషేకం వేళ భక్తజన వాహిని శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో కిక్కిరిసింది. రెండు గంటల పాటు మంత్రోచ్చారణలు, భక్తజన హర్షధ్వానాల మధ్య అత్యంత పవిత్రంగా చేపట్టారు. భక్తజనుల కోసం ప్రత్యక్ష ప్రసారం, ఎల్‌ఈడీ తెరల ద్వారా వీక్షణ సదుపాయం కల్పించారు.

రమణీయంగా రథయాత్ర

మధ్యారాధన సందర్భంగా మధ్యాహ్నం శ్రీరాఘవేంద్రుడిని బంగారు రథంపై ఊరేగించారు. రాయరు బంగారు ప్రతిమను స్వర్ణ రథంపై కొలువుంచగా పీఠాధిపతి నారికేళ సమర్పణతో మంగళ హారతులు పట్టి రథయాత్రకు అంకురార్పణ పలికారు. పండితుల వేదఘోష, మంగళ వాయిద్యాలు మధ్య శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో రథయాత్ర రమణీయంగా సాగింది. వేడుకలో మేళతాళాలు, నృత్య ప్రదర్శనలు, సంకీర్తనాలాపనలు భక్తులను మైమరిపించాయి. రాఘవేంద్రస్వామి బృందావన ప్రవేశం చేసిన శుభదినం కావడంతో భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి వేలకుపైగా భక్తులు తరలివచ్చినట్లు అంచనా. అలాగే రాత్రి పరిమళ తీర్థం పుష్కరిణిలో ఉత్సవమూర్తి తెప్పోత్సవం ఎంతో రమణీయంగా సాగింది. వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. తెప్పోత్సవం అనంతరం ప్రహ్లాదరాయలను గజవాహనంపై కడు వైభవంగా ఊరేగించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ఉత్సవాల్లో భాగంగా యోగీంద్ర సభా మంటపంలో నృత్య ప్రదర్శనలకు అలరించాయి. వేడుకలో పండితకేసరి గిరియాచార్, ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతిఆచార్, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, సంస్కృత గురుకులం ఉపకులపతి పంచముఖి, ద్వారపాలక అనంత స్వామి, వేద పాఠశాల మాజీ ప్రిన్స్‌పాల్ వాదిరాజాచార్, సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజులు పాల్గొన్నారు.



గజవాహనంపై ఊరేగుతున్న ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు



పుష్కరిణిలో తెప్పోత్సవం



బాలికల నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

గోశాలలో పశుగ్రాసం దగ్ధం

- రూ.5 లక్షల నష్టం



శ్రీమఠం గోశాలలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

మంత్రాలయం రూరల్: శ్రీమఠం గోశాలలో జరిగిన ప్రమాదంలో పశుగ్రాసం దగ్ధమైంది. గోశాలలో పశుగ్రాసం ఉంచిన గొడౌన్‌లో సోమవారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు ఏర్పడి వరిగడ్డికి వ్యాపించాయి. మంటలను గమనించిన మఠం సిబ్బంది గోవులను బయటకు వదిలేశారు. అనంతరం ఎమ్మిగనూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. మంటలకు గొడౌన్‌లో ఉన్న పశుగ్రాసం మొత్తం పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు.

మైనారిటీ హాస్టల్‌లో ప్రవేశం పొందండి

కర్నూలు(అర్బన్): కళాశాల విద్యను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులు నగరంలోని వెంకటా చలపతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ పోస్టు మెట్రిక్ మైనారిటీ బాలుర వసతి గృహంలో ప్రవేశం పొందాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 25 సీట్లు ఖాళీగా ఉన్నాయని సోమవారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి కర్నూలుకు వచ్చి కళాశాల విద్యను అభ్యసిస్తున్న పేద మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బావిలో పడి భక్తుడి మృతి



మృతి చెందిన భక్తుడు అనిల్‌కుమార్

కౌతాళం: ఈరన్నస్వామి దర్శనానికి వచ్చిన తెలంగాణ భక్తుడు మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడా మండలం హనుమాపురానికి చెందిన పెద్దింటి అనిల్‌కుమార్ (50) శ్రావణమాసం సోమవారం సందర్భంగా ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి కుటుంబంతో వచ్చాడు. ఉరుకుందకు మజరా గ్రామం అయిన తిమ్మాపురం గ్రామం వద్ద బావిలో అనిల్ స్నానానికి వెళ్లి కాలుజారి పడ్డాడు. ఈత రాకపోవడంతో మునిగిపోతుండటంతో గ్రామస్తులు వెంటనే బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరిని కంటతడి పెట్టించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భానుడి దోబూచులాట!

వాతావరణం ఎప్పుడు ఎలా ఉంటుందో అర్థం కాని పరిస్థితి. అకాల వర్షాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఒకచోట వర్షం కురిస్తే, మరోచోట ఆ జాడ కూడా కనిపించదు. భానుడు కనిపిస్తే చాలు అన్నట్లుగా ఉంటోంది. ఓర్వకల్లు మండలంలోని లొద్దిపల్లె సమీపంలో సూర్య కిరణాలకు ఒక ప్రాంతం వెండి కొండలా మెరుస్తుంటే, మరొక చోట చల్లని వాతావరణం కనిపించింది. ఇదే పరిస్థితి చాలా చోట్ల నెలకొనడంతో ఇదేమి విచిత్రమోనని ప్రజల్లో చర్చ జరుగుతోంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కర్నూలు శివారు జగన్నాథ గట్టుపై..



లొద్దిపల్లె సమీపంలో ఒక్కచోట మాత్రమే కనిపిస్తున్న ఎండ



కొండపై మాత్రమే ఎండ పడుతున్న దృశ్యం



సగం పంటకే ఎండ

ఈరన్న స్వామి.. భక్తుల కష్టాలు కనుమా?



పొలాల వెంట నడుచుకుంటూ క్షేత్రానికి చేరుకుంటున్న భక్తులు



తలనీలాలు తీస్తున్న బాలురులు

కౌతాళం: శ్రావణ మాసం మూడో సోమవారం. దారులన్నీ ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రం వైపు అన్నట్లుగా భక్తులు తరలివచ్చారు. రద్దీకి తగ్గ ఏర్పాట్లలో దేవస్థానం చేతులేత్తేసింది. అదే ట్రాఫిక్.. అదే అపరిశుభ్రతతో భక్తుల ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయానికి ఏటా సుమారు రూ. 20 కోట్ల ఆదాయం ఉన్నా సౌకర్యాలు కల్పనలో వెనుకడుగు వేస్తోంది.

- క్షేత్రానికి సమీపంలో ఎల్లెల్సీ కాల్వ ఉన్న పుణ్య స్నానాలు చేసేందుకు కాల్వ వెంట మెట్లు వంద మీటర్ల పొడువు మాత్రమే ఉన్నాయి. దేవస్థానం ముందు చూపుతో కాల్వకు ఇరువైపులా భక్తుల రద్దీకి అనుగుణంగా మెట్లు నిర్మాణం, షవర్లు ఏర్పాటు చేస్తే స్నానానికి ఇక్కట్లు తప్పేవి. శానిటేషన్ సిబ్బంది తగినంత మంది లేక పోవడంతో క్షేత్ర పరిధిలో ఎక్కడి చూసినా అపరిశుభ్రత కనిపించింది.
- ఓ వైపు వర్షం.. మరో వైపు ట్రాఫిక్, ఇంకో వైపు పంట పొలాలు ఉండటంతో భక్తులు క్షేత్రానికి కాలి నడకన వచ్చేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ట్రాఫిక్ మళ్లింపులో అధికారులు ముందు చూపులేక పోవడంతో ప్రతి సోమవారం ఇదే సమస్య తలెత్తుతోంది.



ఈచనహాల్ దారిలో నిలిచిన వాహనాలు

- కౌతాళం రూట్‌లో ఈచనహాల్ వరకు ట్రాఫిక్ జామ్‌తో హాల్వి రూట్‌లో చిరుతపల్లి వరకు, కోసిగి రూట్‌లో జుమ్మలదిన్నె వరకు, ఆదోని రూట్‌లో రెండు కి లోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది.
- ఉదయం 10 గంటల ప్రాంతంలో ట్రాఫిక్‌లో ఇరుక్కున వారు సాయంత్రం ఐదు తర్వాత బయట పడాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో వృద్ధులు,వికలాంగులు చాలా ఇబ్బందుల పడ్డారు. ట్రాఫిక్‌తో చాల మంది భక్తులు కాలనడకన పొలాల వెంట ఉరుకుందకు చేరుకోగా కొంత మంది అక్కడే పొలాల్లోనే వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.
- ట్రాఫిక్ కంట్రోల్‌లో కేవలం కౌతాళం సీఐ అశోక్‌కుమార్ వారి సిబ్బందితో పాటు కొంత మంది ఎస్సైలు మాత్రమే నియంత్రించే పని చేశారే గాని బందోబస్తు వచ్చిన ఇతర సిబ్బంది చాలా వరకు కనిపించక పోవడం గమనార్హం.



అన్ని దారులు ఇంతే.



ఎల్లెల్సీలో స్నానాలు చేస్తూ..



క్షేత్ర పరిసరాల్లో ఇలాంటి దృశ్యాలు ఎన్నో..

ఆధార్ సెంటర్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న బాధితురాలు

కర్నూలు: ఆధార్ సెంటర్ ఇప్పిస్తానని చెప్పి కర్నూలు బుధవారపేటకు చెందిన బోయ శేఖర్ రూ.60 వేలు తీసుకుని మోసం చేశాడని మంత్రాలయంకు చెందిన వీరేష్ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 81 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నిటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన వినతుల్లో కొన్ని...

- కర్నూలు అశోక్ నగర్‌కు చెందిన వినయ్ కుమార్ కడప రిమ్స్‌లో తన భార్యకు స్టాఫ్ నర్సు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని నంద్యాల పట్టణానికి చెందిన ప్రదీప్ ఫిర్యాదు చేశారు.
- కర్నూలు మండలం పసుపుల, రుద్రవరం, నూతనపల్లె గ్రామాల రైతుల నుంచి పసుపల గ్రామానికి చెందిన పకిడి ఖాజా అనే వ్యాపారి రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేసి సొమ్ము చేసుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని, విచారణ జరిపి తగు న్యాయం చేయాల్సిందిగా అదే గ్రామానికి చెందిన సుల్తాన్ ఫిర్యాదు చేశారు.
- నన్నూరు గ్రామానికి చెందిన గుర్రం నాగన్న, వెంకటస్వామి, వెంకటరాముడు, ఉపేంద్రలు కలసి తన పొలానికి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, సర్వే చేయించడానికి కూడా సహకరించడం లేదని ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామానికి చెందిన కనకమ్మ ఫిర్యాదు చేశారు.
- కర్నూలుకు చెందిన రవీంద్ర పాతబస్తీలోని పూల బజార్‌కు చెందిన కొంతమంది మహిళల నుంచి ఆధార్ కార్డు, పాన్ కార్డు, సిమ్ కార్డు, ఫొటోలు తీసుకుని బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించి వారికి తెలియకుండా వారి పేర్ల మీద ఏసీలు, టీవీలు, సెల్‌ఫోన్లు తీసుకుని మోసం చేస్తున్నాడని కర్నూలు వడ్డెగేరికి చెందిన షేక్ సన ఫిర్యాదు చేశారు.
- రాజు, మహేష్ అనే వ్యక్తులు ఫోర్జరీ పట్టాదారు పాసు పుస్తకాలు తయారు చేసుకుని తమ ఆస్తిని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, నన్ను, మా నానమ్మను కొట్టి చంపుతామని బెదిరిస్తున్నారని ఆదోని పట్టణానికి చెందిన రాహుల్ ఫిర్యాదు చేశారు.

వీరభద్రస్వామికి పెళ్లి కుమార్తె నచ్చింది...

- కార్తీక మాసంలో నిశ్చితార్థం



తుంగభద్ర నది నుంచి జలాలను తీసుకొస్తున్న ఖైరుప్పల గ్రామస్తులు



ఖైరుప్పల గ్రామంలో పూజలందుకున్న కాళికాదేవి, వీరభద్రస్వామి

ఆస్పరి: శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా మూడవ సోమవారం ఖైరుప్పల గ్రామంలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవిల పెళ్లి చూపులు కార్యక్రమం వైభవంగా సాగింది. మధ్యవర్తులు పుష్పాలదొడ్డి గిడ్డాంజనేయస్వామి, చెన్నంపల్లి కార్తికేయ స్వామి సమక్షంలో సంప్రదాయం ప్రకారం చేపట్టిన పెళ్లి చూపుల్లో వీరభద్రస్వామికి కాళికాదేవి నచ్చడంతో కార్తీక మాసం ముగిసిన తరువాత వచ్చే మొదటి సోమవారం నిశ్చితార్థం ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఉగాది వేడుకల్లో భాగంగా వీరభద్రస్వామికి, కాళికాదేవికి పెళ్లి జరిపిస్తామని గ్రామస్తులు తెలిపారు. శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఖైరుప్పల గ్రామస్తులు తుంగభద్ర జలాలు తెచ్చి వీరభద్రస్వామి, కాళికాదేవిలకు అభిషేకం చేశారు. సంప్రదాయం ప్రకారం ప్రతి ఏటా గ్రామస్తులు భజన చేసుకుంటూ పాదయాత్ర ద్వారా తుంగభద్ర జలాలను తీసుకొచ్చి స్వామి వారికి అభిషేకం చేస్తామని చెప్పారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పూల పల్లకీలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

డ్రోన్‌తో శ్రీశైలంలో నిఘా

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో పాటు జూదం, గంజాయి విక్రయాలు.. తదితర అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు శ్రీశైలం పోలీసులు డ్రోన్ సేవలను ఉపయోగిస్తున్నారు. సోమవారం శ్రీశైలం సీఐ ప్రసాదరావు, సిబ్బందితో కలిసి డ్రోన్ సహాయంతో శ్రీశైలంలో పలు ప్రదేశాలను పరిశీలించారు. సాక్షిగణపతి, హఠకేశ్వరం, దాసరి అన్నసత్రం, దేవస్థానం టోల్‌గేట్, నందిమండపం, పాతాళగంగ జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రదేశాలలో పరిశీలించారు.

దేవుడికి పూజారి శఠగోపం

- మట్కా ఆడి అప్పులపాలైన పూజారి
- దేవుడి వెండి ఆభరణాలు విక్రయించేందుకు యత్నం
- ఆభరణాలు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమలత

ఆదోని అర్బన్: దేవుడి సేవలో తరించాల్సిన పూజారి మట్కాకు బానిసై అప్పులపాలయ్యాడు. అప్పుల బాధ నుంచి బయటపడేందుకు ఏకంగా దేవుడి ఆభరణాలపై కన్నేశాడు. వాటిని గుట్టుగా అపహరించి విక్రయించేందుకు తరలిస్తుండగా పోలీసులు రంగ ప్రవేశం చేసి అరెస్ట్ చేశారు. ఆదోని డీఎస్పీ హేమలత తెలిపిన వివరాల మేరకు.. ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో వెలిసిన శ్రీ వసిగేరప్ప దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న గొర్రెల వసిగేరప్ప మట్కా ఆడుతూ అప్పులపాలయ్యాడు. బెంగళూరులో ఉంటూ మట్కా ఆడి అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలో దేవుడి ఆభరణాలు అమ్మేసి బయటపడాలని భావించాడు. దీంతో గుడిలో ఉన్న విగ్రహాలను పది రోజుల క్రితం ఇంట్లో దాచి పెట్టాడు. అయితే ఆలయంలో 4.386 కేజీల వెండి ఆభరణాలు, 10 గ్రాముల బంగారు బాసింగం కనిపించడం లేదని ఆ గ్రామానికి చెందిన కురి చంద్ర ఈనెల 10వ తేదీన ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పూజారి వసిగేరప్ప తన ఇంట్లో దాచిన ఆభరణాలను కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో విక్రయించేందుకు సోమవారం తరలిస్తుండగా చాగి గ్రామం శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ముఖ ద్వారం సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆభరణాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు వివరాలను స్థానిక డీఎస్పీ బంగ్లాలో డీఎస్పీ హేమలత మీడియాకు వివరించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాలను ప్రదర్శించారు. కేసును ఛేదించిన ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రామయ్య, కానిస్టేబుళ్లు సుదర్శన్, ఖాసీంను డీఎస్పీ అభినందించారు.

జిల్లాకు బంగారు పతకం

కర్నూలు (సెంట్రల్): నీతి అయోగ్ గుర్తించిన ఆస్పిరేషనల్ బ్లాకుల్లో చేపట్టిన సంపూర్ణత అభియాన్ కింద కర్నూలు జిల్లాకు బంగారు పతకం వరించిందని, ఇందుకోసం కృషి చేసిన అధికారులను అభినందిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మద్దికెర, చిప్పగిరి, హొళగుంద మండలాల్లో నిర్దేశించిన ఆరు సూచికలు వంద శాతం ప్రగతి సాధించడానికి కారణమైన అధికారులను కలెక్టర్, ఎమ్మెల్సీ బీటీ నాయుడు సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దేశంలో నీతి అయోగ్ గుర్తించిన 500 ఆస్పిరేషన్ బ్లాకుల్లో జిల్లాలోని మద్దికెర, చిప్పగిరి, హొళగుంద మండలాలు ఎంపికయ్యాయన్నారు. అందులో భాగంగా నీతి అయోగ్ నిర్దేశించిన ఆరు లక్ష్యాలను సాధించడంతో జిల్లాకు గోల్డ్ మెడల్‌తో పాటు అవార్డులు లభించినట్లు చెప్పారు. అంతేకాక మద్దికెర మండలానికి రూ.1.50 కోట్లు, చిప్పగిరి మండలానికి రూ.కోటి నగదు కూడా అభివృద్ధి పనుల కోసం వరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సీపీఐ హిమ ప్రభాకర్ రాజు, హౌసింగ్ పీడీ చిరంజీవి పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడి చేయిస్తానని మోసం చేశాడు

- 19.84 లక్షలు తీసుకుని బెదిరిస్తున్నాడు
- ఎస్పీని ఆశ్రయించిన బాధితుడు



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల: 'కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నాకు మా నాన్న మిత్రుడు కిశోర్ తన సోదరుడు డాక్టర్ సునీల్ ద్వారా కిడ్నీ మార్పిడి చేయిస్తానని నమ్మించి రూ. 19.84 లక్షలు తీసుకుని మోసం చేశాడు. ఆపరేషన్ చేయించకుండా డబ్బులు తిరిగి ఇవ్వకుండా భయపెడుతున్నాడు' అంటూ నంద్యాల పట్టణానికి చెందిన ధనుంజయ్ ఎస్పీ అధిరాజ్‌సింగ్‌ను ఆశ్రయించి వినతి పత్రం అందజేశారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యా దుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్‌లో 89 వినతులు వచ్చాయని, వాటిపై పూర్తిస్థా యి విచారణ చేసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధి లో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని, ఫిర్యాదులను పునరావృతం కాకుండా చూడాలని, నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని....

- ఉయ్యాలవాడ మండలం తుడుమలదిన్నె గ్రామంలో నాకు 1.27 సెంట్ల భూమి ఉంది, నా పక్కన పొలం ఉన్న దస్తగిరిరెడ్డి నా పొలంలోని 17 సెంట్లను ఆక్రమించుకొని రెండు సంవత్సరాల నుంచి ఇబ్బంది పెడుతున్నాడు. విచారణ చేయించి న్యాయం చేయండి' అంటూ ఆ గ్రామానికి చెందిన మోహన్‌రావు ఎస్పీకి వినతి పత్రం అందజేశారు.
- నాకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుతుర్లు సంతానం. నా భర్త పేరు మీద 2.64 సెంట్ల భూమి ఉంది. ఆయన మరణానంతరం నాకు రావాల్సిన ఆ భూమిని నాకు తెలియకుండా నా పెద్ద కొడుకు మద్దిలేటి అక్రమంగా పట్టాదారు పాస్ పుస్తకం తీసుకున్నాడు. ఇందులో 1.28 సెంట్ల భూమిని వేరే వాళ్లకు అమ్ముకున్నాడు. మద్దిలేటిపై చట్టపరమైన చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలని చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామానికి చెందిన కె.నరసమ్మ ఎస్పీకి వినతి పత్రం అందజేశారు.